చేదు నిజం

వాణిశ్రీ

సండే చదువుతూ కూర్చున్నాడు రాయప్ప.

టెలిఫోన్ మ్రోగింది.

రిసీవర్ ఎత్తి "హలో" అన్నాడు.

"డిటెక్టివ్ రాయప్ప వున్నారా?" సన్నటి కంఠం వినిపించింది టెలిఫోన్‌లో.

"మీ రెవరు?"

"నేను ఆపరేటర్ని. ట్రంకాల్ ఫ్రమ్ రాజవరం పి. సి. వో."

"రాజవరం పి.సి.వో." గొణుక్కొన్నాడు. ఆ వూరి పేరు అతను ఎప్పుడూ వినలేదు. అక్కడ తనకు తెలిసిన వాళ్ళు ఎవరు?

"హలో...."

"ఎస్. రాయప్ప హియర్. కనెక్షన్ యివ్వండి" అన్నాడు.

కొన్ని క్షణాల తర్వాత "హలో, రాయ్!" అంది

అవతల మాట్లాడుతున్న కంఠం.

"ఎవరు?"

"నేను సంధ్యని మాట్లాడుతున్నాను—రాజవరం నుంచి."

"సంధ్యా! నువ్వా? రాజవరం ఎక్కడ? అక్కడికి ఎందుకు వెళ్ళావు?"

"అదంతా తర్వాత చెప్తాను. నువ్వు వెంటనే బయల్దేరి రావాలి."

"ఎందుకు?"

"హేమలత తల్లి చనిపోయింది."

"హేమలత ఎవరు?"

"అప్పుడే మర్చిపోయావా? మన క్లాస్‌మేట్. కల్చరల్ సెక్రెటరీగా చేసింది గుర్తులేదూ?"

"ఎస్. ఎస్....గుర్తొచ్చింది. కాని వాళ్ళమ్మ చచ్చిపోతే నేనెందుకు?"

"ముందు బయల్దేరి వెంటనే రా. కథంతా తర్వాత చెప్తాను."

"ఎలా రావాలి? ఆ వూరు ఎక్కడుందో కూడ తెలియకుండా?"

"చెప్తాను నోట్ చేసుకో."

రాయ్ నోట్‌బుక్‌లో సంధ్య చెప్పిన వివరాలన్నీ నోట్ చేసుకొన్నాడు.

సూట్‌కేస్ సర్దుకొని రూమ్‌కి తాళంవేసి హోటల్ కౌంటర్లో వున్న నాగరాజుకి కీ ఇచ్చాడు.

"ఎక్కడికి?" ప్రశ్నించాడు నాగరాజు.

చెప్పాడు రాయప్ప సంధ్య చెప్పినదంతా.

"మంచి బేరమే నన్నమాట."

"ఏమీ ఫీజ్ వచ్చే కేస్‌లా కన్పించడంలేదు" నవ్వుతూ అన్నాడు రాయప్ప.

"విష్ యూ బెస్టు ఆఫ్ లక్."

"నువ్వూ గూడా రారాదూ. సరదాగా వుంటుంది."

"తంతాడు మా నాన్న. అసలే మా తమ్ముడు వూళ్ళో లేడు గూడా!" అన్నాడు నాగరాజు.

"అయితే వస్తా మరి. ఎవరన్నా ఫోన్ చేస్తే వివరాలు నోట్ చేసి వుంచు. నేను వీలైనంత త్వరగా వస్తాను" అన్నాడు రాయప్ప.

"ఏమో! అక్కడ సంధ్య వుంది మరి" కొంటెగా అన్నాడు.

"యూ! సిల్లీ...." నవ్వాడు.

2

దుమ్ము రేపుకొంటూ దుమ్ములో కలిసిపోయి పరిగెత్తుతోంది బస్.

దాదాపు ఇరవై మైళ్ళు దుమ్ములోనే ప్రయాణం చెయ్యడంవల్ల రాయప్ప తల, శరీరమూ, బట్టలూ ఎర్ర మట్టితో మునిగిపోయాయి.

ఇంకా సూర్యుడు అస్తమించక పోయినా ఎత్తైన వృక్షాల మధ్య పోతున్న బస్సులో కూర్చున్న వారికి చీకటి పడిపోయిందన్న అనుభూతి కలుగుతోంది.

ఘాట్ రోడ్డులో మెలికలు తిరుగుతోంది బస్.

అప్పుడప్పుడూ రోడ్డు మీద కన్పించే జింకలూ, కుందేళ్ళూ, నెమళ్ళు బస్సు రాకను గమనించి ప్రక్కకు పరిగెత్తి చెట్లలో మాయమైపోతున్నాయి.

అంత దట్టమయిన అడవిని యెప్పుడూ చూళ్ళేదు రాయప్ప.

పచ్చటి ప్రకృతి దృశ్యాలను తన్మయత్వంతో చూశాడు అప్పటివరకూ.

కాని ఇప్పుడిక వెలుగు తగ్గిపోయింది.

"రాజవరం యింకా ఎంతదూరం వుంది?"

"వచ్చేదే రాజవరం."

కాసేపటి బస్సు ఆగింది.

"సార్ రాజవరం" రాయప్పవంక చూస్తూ అన్నాడు కండక్టరు.

సూట్ కేస్ తీసుకొని బస్సు దిగాడు. ఎక్కడా ఇళ్ళు కన్పించలేదు.

"రాజవరం యెక్కడ? యిళ్లు కన్పించడంలేదే?"

"రెండు మైళ్ళు నడవాలి. సరాసరి వెళ్ళిపోండి" నవ్వుతూ అన్నాడు కండక్టరు బస్ డోర్ లాగుతూ.

"థాంక్స్!" అన్నాడు రాయప్ప.

బస్సు వెళ్ళిపోయింది దుమ్ము రేపుకొంటూ.

ఒంటరిగా మిగిలిపోయాడు రాయప్ప.

ఒకవైపు నుంచి చీకటి తరుముకొస్తోంది. దాదాపు రెండుమైళ్ళు నడవాలి. ఎలాగైనా వెలుగు వెళ్ళిపోయే లోపుగా వూరుచేరాలని పట్టుదలతో వడివడిగా అడుగులు వెయ్యసాగాడు.

చీకట్లో వూరి స్వరూపం కన్పించడంలేదు.

ఊరి మొదట్లో అన్నీ పూరిళ్ళే. అక్కడక్కడా పెంకుటిళ్ళు కొన్ని కన్పిస్తున్నాయి. వూరి చివర ఎత్తుగా కన్పిస్తున్న మూడు అంతస్థుల భవనం హేమలతదే అని వూహించాడు రాయప్ప.

వూళ్ళో కరెంటులేదు. వెన్నెల లేదుగాని నక్షత్రాల కాంతిలో రోడ్డు కనిపిస్తూనే వుంది. దాన్లో యిళ్ళ

ముంగు నిలుచున్నవాళ్ళు కొందరు అతన్ని వింతగా చూశారు.

"యెవరు బాబూ?" గేట్లో నిలుచున్న అతను ప్రశ్నించాడు.

"రాజామణిగారి ఇల్లు ఇదేగా!"

"అవును. కాని...."

"నాకు తెలుసు. నేను వాళ్ళమ్మాయికోసం వచ్చాను" అన్నాడు రాయప్ప.

అతను రాయప్ప చేతిలోని సూట్ కేస్ అందుకోబోయాడు.

"ఫరవాలేదు...." అన్నాడు రాయప్ప.

"ఇవ్వండి బాబూ!" అని సూట్ కేస్ని బలవంతంగా తీసుకొని ముందుకు నడవసాగాడు.

అతన్ని పరీక్షగా చూశాడు రాయప్ప.

దాదాపు అరవై ఏళ్ళు దాటి వుంటాయి అతనికి. జుట్టు బాగా తెల్లబడిపోయింది. కాని శరీరం మాత్రం దృఢంగానే వుంది. నీరుకావి పంచె చొక్కా వేసుకొన్నాడు.

"తాతా నీ పేరేమిటి?"

"వెంకన్న బాబూ!"

"ఈ వూరేనా నీది?"

"అవును బాబూ!"

"ఈ ఇంట్లోనే పని చేస్తున్నావా?"

"పెదబాబుగారి హయాం నుంచి పని చేస్తున్నా."

"ఎప్పుడూ ఇక్కడే వుంటావా?"

"ఆఁ.... ఇక్కడే."

"నీకు ఇల్లు లేదా?"

"లేదు బాబూ! ఒక్క కొడుకు. వాడు కోయంబ త్తూరు వెళ్ళిపోయాడు. అక్కడ మంచి వుద్యోగమే. నన్ను రమ్మని యెంతో గొడవ చేస్తాడు. కాని పుట్టి పెరిగిన వూరు. ఇక్కడే రాలిపోవాలని...."

"అలాగా!...." అన్నాడు రాయప్ప.

అతనికి అటూ యిటూ పచార్లు చేస్తున్న సంధ్య కని పించింది.

అడుగుల చప్పుడు విని ఆగిపోయి పరీక్షగా చూసింది.

"హాయ్! రాయ్...." సంతోషంతో పరిగెత్తు కొంటూ వచ్చింది చిన్నపిల్లలా.

"నువ్వింత త్వరగా వస్తావనుకోలేదు" అంది అతని చేతిని పట్టుకొని వూపుతూ.

"నేను అర్జంట్‌గా స్నానం చెయ్యాలి. వేడినీళ్ళు వున్నాయా?" అన్నాడు.

"ముందు లోపలకి రా!" అంది సంధ్య.

స్నానం చేసి భోజనం చేసేటప్పటికి తొమ్మిది దాటింది.

కిటికీలోంచి చలిగాలి రివ్వున వీస్తోంది. తలుపులు మూసి సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

సంధ్య వచ్చి ఎదురు సోఫాలో కూర్చుంది.

"హేమలత యెక్కడ? కన్పించలేదు...." అన్నాడు రాయప్ప.

"ఇంటి నిండా బంధువు లున్నారు. రేపు వస్తుందిలే" అంది సంధ్య.

"అంటే యిది యెవరి యిల్లు?" ఆశ్చర్యంగా ప్రశ్నిం చాడు.

"ఇది గెస్టు హౌస్!" నవ్వింది సంధ్య.

"యింత పెద్ద యింట్లో వొక్కదానివి వుంటున్నావా?...."

"నాకేం భయం? తోడుగా సర్వెంట్ మెయిడ్ వుంటుందిలే" అంది సంధ్య.

"అసలు కథ చెప్పు" అన్నాడు.

"జర్నీ చేసి వచ్చావు గదా. రెస్టు తీసుకో. కథంతా రేపు చెప్తాను."

"ఫరవాలేదు చెప్పు. లేకపోతే నాకు నిద్ర పట్టదు."

"చెప్పినా నిద్ర పట్టదు. యేదోకటి ఆలోచిస్తూ వుంటావు."

"బాగుంది. ఆలోచించపోతే ఎలా?" అన్నాడు.

నవ్వింది సంధ్య.

"అసలు యిక్కడికి నువ్వెందుకు వచ్చావు?" ప్రశ్నించాడు.

"లత రమ్మని లెటర్ రాసింది. ప్రక్కన యేదో వూరుందట. అక్కడ కాళికాదేవి వుత్సవాలు జరుగుతాయట. అవన్నీ చూడొచ్చు రమ్మని రాసింది. సరేనని వచ్చాను. ఇంతలో ఈ ఘోరం జరిగింది."

"అసలు ఏం జరిగింది?"

"అర్థం కావడంలేదు. కాని ఎవరో వాళ్ళమ్మని చంపారని లత అనుమానపడుతోంది."

"ఎలా? అసలు ఆవిడ ఎక్కడ చనిపోయింది? ఇంట్లో కాదా?"

"లేదు. కొండ అంచునుంచి జారిపడిందో లేక యెవరైనా నెట్టారో ఏమో తెలీదుగాని, చాలా ఎత్తునుంచి బండరాళ్ళమీద పడి చనిపోయింది."

"నువ్వు చూశావా ఆ ప్రదేశం?"

"ఆఁ...."

"రేపు నాకు చూపించు."

తల వూపింది సంధ్య.

"పోలీసులు వచ్చారా?"

"ఆఁ— బౌన్‌లో పోస్టుమార్టమ్ చేశారు గూడా! ఇంకా రిపోర్టు రాలేదు. శవాన్ని బంధువులకు అప్పగించారు. రాత్రి దహనం చేశారు."

"బంధువులు అంటున్నావు యెవరెవరు వచ్చారు?"

"నాగభూషణం అని లతకి బాబాయి. అతని భార్య పిల్లలు, లత మేనత్త సీతమ్మ, ఆమె కొడుకు సురేష్. ఇంకా లత తరఫువాళ్ళు వచ్చారు. అంతా కలసి పాతిక మంది పైనే వుంటారు."

"శవాన్ని దహనం చేశారా?"

"ఆఁ."

"మరి తలకొరివి యెవరు పెట్టారు? లతకి అన్నదమ్ములున్నారా?"

"లేరు. వాళ్ళ బాబాయి కొడుకుతో పెట్టించారు."

"అలాగా? అసలు లత తల్లి అదే రాజామణి మరణం ప్రమాదవశాత్తు జరగలేదు అనే అనుమానం లతకి ఎందుకు వచ్చింది?"

"నాకు వివరంగా చెప్పలేదు కాని వాళ్ళ కుటుంబంలో ఏవో కలతలు వున్నట్లు అనిపించింది. అది అసలే చాల విచారంలో వుంది. అందుకే వివరాలు అడగలేదు."

"నువ్వు యెవర్ని అనుమానిస్తున్నావు?"

"ఎవర్నీ అనుమానించలేకనేగదా మహానుభావుడివి నిన్ను పిలిపించింది. నిన్ను చూస్తే లత ఆశ్చర్యపోతుంది" నవ్వుతూ అంది సంధ్య.

"అంటే నేను వస్తున్నట్లు లతకి తెలియదా?" నివ్వెరపోతూ ప్రశ్నించాడు రాయప్ప.

"నేను చెప్పలేదు. అదేమో ఏడుస్తూ కూర్చుంది. బంధువులంతా కొత్త. బోర్‌గా వుంది. ఇంతలో నువ్వు జ్ఞాపకం వచ్చావు. హైదరాబాదులో డిటెక్టివ్ ట్రెనింగ్ పూర్తి చేశావని లెటర్ రాసిన సంగతి గుర్తొచ్చి ఈ కేసు నీకు అప్పగిస్తే ఎలా సాల్వ్ చేస్తావో చూడాలనిపించింది. పోస్టాఫీసుకి వెళ్ళి నీకు ట్రంకాల్ బుక్ చేశాను. లతకి చెప్పలేదు. చెప్తే వద్దంటుందేమో?"

"లతకి ఇంట్రెస్ట్ లేనప్పుడు నీ కెందుకీ గొడవ. వాళ్ళమ్మ యెలాగూ చనిపోయింది. చంపింది యెవరో తెలుసుకున్నందువల్ల లాభం ఏముంది?"

"ఎందుకుండదు? ఈ రోజు వాళ్ళమ్మని చంపారు. తర్వాత లతని చంపడానికి ప్రయత్నించవచ్చు."

అవునన్నట్లు తలవూపాడు రాయప్ప.

"మరి నా ఫీజు ఎవరిస్తారు?" నవ్వు ఆపుకుంటూ అడిగాడు రాయప్ప.

"ఫీజు గురించి వర్రీ యెందుకు? నేనే ఇస్తాను" అంది సంధ్య నవ్వుతూ.

"అడ్వాన్స్ కావాలి" అంటూ ఆమె అరచేతిని బలంగా పట్టుకున్నాడు.

సంధ్య ముఖం సిగ్గుతో మందారంలా ఎర్రబడింది.

రాయప్ప ఆమెను తన మీదకు లాక్కుని ముద్దు పెట్టుకోబోయాడు.

"ఆగండి డిటెక్టివ్ గారూ! నో అడ్వాన్స్!" అంటూ అతని పట్టు విడిపించుకొని పరిగెత్తింది.

"గుడ్ నైట్. విష్ యూ స్వీట్ డ్రీమ్స్" అంటూ తలుపులు మూసేసి వెళ్ళిపోయింది.

3

గెస్ట్‌హౌస్‌కి వందగజాల దూరంలో వుంది హేమలత వాళ్ళ ఇల్లు. రెండూ ఒకే కాంపౌండ్‌లో వున్నాయి. మూడంతస్థుల మేడ చుట్టూ విశాలమైన ప్రహారీ గోడ వుంది.

బెడ్ కాఫీ తీసుకొంటూ పరిసరాలను గమనిస్తున్నాడు రాయప్ప.

"బాబుగారూ వేడినీళ్ళు గదిలో పెట్టాను" అన్నాడు వెంకన్న.

రాయప్ప స్నానంచేసి వచ్చేసరికి టీపాయిమీద వేడి వేడి ఇడ్లీ పొగలు కక్కుతూ కనిపించింది.

వాకిట్లో నిల్చున్న ఎర్రచీర యువతిని చూసి రాయప్ప గుండెలు అదిరాయి.

ఎర్రగా ఎత్తుగా వుంది ఆమె. ఇరవై ఏళ్ళలోపు వుంటాయి. బలంగా పిటపిటలాడుతోంది. ఆమె జాకెట్ కట్టుకున్న తీరుచూసి పట్నవాసం పిల్లలు ఆమెవద్ద ఫ్యాషన్స్ నేర్చుకోవాలేమో అనిపించింది. మేనకని చూసిన విశ్వామిత్రుడిలా రాయప్ప మనసు చెదిరిపోయింది. ముఖ్యంగా ఆమె కళ్ళు విశాలంగా ప్రకాశవంతంగా వున్నాయి. ఆమె కళ్ళతోనే నవ్వుతున్నట్లు ఫీలయ్యాడు. ఆమె ముఖంలో రాచవంశపు ఠీవి కనిపిస్తోందిగాని పని పిల్లలాలేదు.

"నీ పేరేమిటి?"

"సోని."

"సోని? అదేం పేరు."

"అదొక పేరు" నవ్వింది.

"ఆ సంగతి నాకు తెలుసు. కాని అటువంటి పేరు ఎప్పుడూ వినలేదు."

"మీరు వినని పేర్లు ఎన్నో వుంటాయి."

'ఓసి దీని అసాధ్యం కూలా' మాటకి మాట అంటిస్తోంది. ఎవరోగాని మాటలు నేర్పిన పిట్టలావుంది, అనుకొన్నాడు.

"అవుననుకో. ఎప్పుడూ వినని పేరు మాత్రమేకాదు. ఎన్నడూ చూడని మనిషిని గూడా నువ్వు. చాల అందంగా వున్నావు నువ్వు."

"వయసులోవున్న ప్రతి ఆడదీ అందంగానే వుంటుంది. చూసిన మొగాడల్లా పొగుడుతూనే వుంటాడు."

రాయప్పకి ఆ మాటలు నసాళానికి అంటాయి.

"లోకం సంగతికాదు. ముఖ్యంగా నీ సంగతి మాట్లాడుతున్నాను. నీ అంత అందగత్తెను యెక్కడా చూడలేదు నేను."

రాయప్ప స్తుతివచనాలకు ఆమె పొంగిపోతున్నట్లు లేదు.

"ఇలాంటి మాటలు చెప్పే ఒక వెధవ నన్ను మోసం చేశాడు" అంది నిర్లక్ష్యంగా.

"నిన్ను మోసంచేశాడా? పూర్ ఫెలో" అన్నాడు రాయప్ప.

"ముందు టిఫిన్ తీసుకోండి. చల్లారిపోతున్నది."

"ఇంకా టిఫిన్ గూడా ఎందుకు నిన్ను చూస్తే కడుపు నిండిపోయినట్లనిపిస్తోంది."

"అయితే తీసుకెళ్ళిపోమంటారా?" అంటూ ఆమె ట్రే ఎత్తింది రెండు చేతులతో.

ఆమె వంగినప్పుడు కనిపించిన వక్షోజాల విశ్వరూపం చూసి రాయప్పకి మతిపోయినట్లనిపించింది.

సోని నవ్వుతూ "మీరు టిఫిన్ కానివ్వండి. కాఫీ తీసుకొస్తాను" అంటూ నిష్క్రమించింది.

సోని వెళ్ళిన పావుగంటకి వచ్చింది సంధ్య "గుడ్ మార్నింగ్" అంటూ.

రాయప్ప సీరియస్‌గా చూశాడు.

"కోపం వచ్చిందా? అయితే రాత్రి నిద్రపట్టలేదన్న మాట" అంది నవ్వుతూ.

"బ్రహ్మాండంగా పట్టింది" అన్నాడు.

"ప్రేమలతని ఈ రోజుగూడా మనం ఒంటరిగా కలుసుకోలేం" అంది సంధ్య.

"ఏం?"

"ఈ రోజు చిన్నకర్మట. చాల బిజీగా వుంది."

"ఇదెక్కడి కేసురా బాబూ! డిటెక్టివ్ కోసం క్లైంట్ ఎదురుచూడాల్సిందిపోయి క్లైంట్ ఇంటర్వ్యూ కోసం డిటెక్టివ్ ఎదురు చూడాల్సొచ్చింది" అన్నాడు.

"మీ చమత్కారానికేమిగాని తొందరగా తెమలండి. హత్య జరిగిన ప్రదేశానికి వెళ్దామన్నారుగా. మళ్ళీ ఎండెక్కుతోంది" అంది.

"సోని కాఫీ తేవడానికి వెళ్ళి యింకా రాలేదు" అన్నాడు రాయప్ప గుమ్మంవైపు చూస్తూ.

"బాగుంది.అదుగో ఆ ఫ్లాస్క్‌లో పది కాఫీలున్నాయి. ప్రొద్దున నేనే పంపించాను" అంటూ ఫ్లాస్క్ మూత తీసి కప్పులో పోసింది సంధ్య.

కాఫీ సిప్ చేస్తూ అన్నాడు రాయప్ప "నేను డిటెక్టివ్‌నని యెవరికీ తెలియగూడదు. ఆఖరికి లతకి గూడా."

"ఏం?" అనుమానంగా చూసింది సంధ్య.

"తెలిస్తే కేసు సంగతి ఎలావున్నా మనం క్షేమంగా బైటపడటం కష్టం" అన్నాడు.

"ఎలా అనుమానిస్తున్నావు?"

"ఇక్కడ అటువంటి పరిస్థితులున్నాయి. ఎవరైనా చంపి అవతల పారెయ్యడం యెంతో తేలిక యిక్కడ. పెద్ద అడవి, అన్నీ కొండలు ఎక్కడ చూసినా నిర్మానుష్యమైన ప్రదేశాలు. మనల్ని చంపి పాతేసినా ఎవరూ కనుక్కోలేరు" అన్నాడు.

భయంగా చూసింది సంధ్య.

"నువ్వేమీ భయపడకు. నువ్వు లతకి డియరెస్టు ఫ్రెండ్‌వని అందరికీ తెలిసిపోయింది. నన్ను నీ బాయ్ ఫ్రెండ్‌గా చెప్పు. దట్సాల్."

"అలాగేనన్నట్లు తల వూపింది.

"వెల్. ఇక బయల్దేరదాం" కెమెరా భుజాన తగిలించుకొని బయల్దేరాడు రాయప్ప.

"గుడ్ మార్నింగ్!" అంటూ చొరవగా లోపలకి వచ్చిన అతన్ని చూసి ఆగిపోయాడు రాయప్ప.

"గుడ్ మార్నింగ్! మీరు...." అన్నాడు యెవరో తెలియక.

"వీరు మిస్టర్ వేణుగోపాల్. లతవాళ్ళ ఎస్టేట్ మేనేజర్" అంటూ పరిచయం చేసింది సంధ్య.

"గ్లాడ్‌టూ మీట్ యూ!" రాయప్ప షేక్‌హేండ్ యిచ్చాడు.

"ఈయన మిస్టర్ రాయ్. నా బాయ్‌ఫ్రెండ్" సిగ్గుపడుతూ అంది సంధ్య.

"గ్లాడ్‌టూ మీట్ యు మిస్టర్ రాయ్" అన్నాడు

వేణుగోపాల్.

"ఐ యామ్ వెరీ సారీ మిష్టర్ వేణుగోపాల్. కొన్నాళ్ళు సరదాగా గడపాలని వచ్చాను కాని నేను వచ్చేసరికే లత వాళ్ళమ్మగారు పోయారట. వచ్చాక తెలిసింది. ఈ పరిస్థితుల్లో యెలా వుండగలం. అందుకే యీ రోజు వెళ్ళిపోవాలనుకొంటున్నాం" అన్నాడు రాయప్ప.

"మీరు రాత్రి వచ్చారని తెలిసింది. అప్పుడే వెళ్ళిపోతారా. జరిగిందానికి విచారించి లాభం ఏముంది? పాపం లత చాల విచారంలో వుంది. ఈ సమయంలోనే స్నేహితులు దగ్గిర వుండాలి. యామై కరెక్ట్" అన్నాడు వేణుగోపాల్.

"యూ ఆర్ కరెక్ట్. బట్...." అంటూ సంధ్య వైపు చూశాడు.

ఇద్దరి చూపులూ కలుసుకొన్నాయి.

"ఏమంటావ్ సంధ్యా?"

"అంతా నీ యిష్టం రాయ్."

"నో....నో....నీ యిష్టం."

"కాదు, నీ యిష్టమే."

"ప్లీజ్ లిజన్ మీ. అంతా నా యిష్టం. మీరు కొన్నాళ్ళు ఇక్కడే వుండాలి. ఓ. కే...." అంటూ నవ్వాడు వేణుగోపాల్.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"మిష్టర్ వేణుగోపాల్. మీరు చూస్తే చాల యంగ్‌గా కనిపిస్తున్నారు. నాట్ ఎ బౌట్ ట్వెంటీ ఫైవ్."

"యస్."

"ఇంత పెద్ద ఎస్టేట్ వ్యవహారాలు యెలా మేనేజ్ చేస్తున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు రాయప్ప.

"నాదేముంది? అంతా మా ఫాదర్ వారసత్వమే. నేను బి.కామ్. పూర్తి చేశాను. యం.కామ్. చదవాలనుకున్నాను గూడా. కాని మా ఫాదర్ డిస్కరేజ్ చేశాడు. ఆయన దాదాపు ఇరవై ఏళ్ళుగా ఈ ఎస్టేట్ మేనేజ్ చేస్తున్నారు. ఇప్పుడాయన ఆరోగ్యం బాగా లేదు. పెరాల్సిస్ గూడా ఎటాక్ అయింది. నాకు కాస్త ట్రైనింగ్ యిచ్చాడు. సంవత్సరం నుంచి నేనే మేనేజ్ చేస్తున్నాను.అలవాటైపోయింది మిష్టర్ రాయ్. మనిషికి అసాధ్యమైంది ఏదీ లేదని నా వుద్దేశ్యం. తల్చుకుంటే ఎంత గొప్పవాడైనా కాగలడు."

"యస్....యస్....మనిషికి ఆత్మవిశ్వాసం కావాలి. అదివుంటే ప్రపంచాన్ని జయించగలడంటారు" అన్నాడు రాయప్ప.

"నిజమే. లత తల్లిగారు బహుశా మీకు పరిచయం లేదనుకొంటాను. ఆవిడ చాలా పట్టుదల మనిషి. భర్త చనిపోయినా ఏ మాత్రం నిరాశ చెందకుండా యెంతో చాకచక్యంగా ఎస్టేట్ వ్యవహారాలు నిర్వహిస్తున్నారు. బట్ ఫేట్ ఈజ్ బాడ్. యాక్సిడెంట్‌లో ఆవిడ పోయారు" అన్నాడు వేణుగోపాల్.

"ఎందుకు జరిగింది అలా? మీకేమైనా వివరాలు తెలుసా?"

"నాకేం తెలియదు. నిజానికి నే నా సమయానికి టౌన్‌లో వున్నాను. ఎవరో కొండమీద నుంచి త్రోస్తే పడిపోయారని పుకారొకటి పుట్టింది. పోలీసులు వచ్చారు. ఎవరో రిపోర్టు చేశారట. లేనిపోని గొడవ జరిగింది. అనవ

పరంగా పోస్టుమార్టమ్ అంటూ నానా భీభత్సం చేశారు."

"పోస్టుమార్టమ్ రిపోర్టులో ఏం తేలింది?"

"ఏముంటుంది? దెబ్బలు తగలడంవల్ల నేనని వుంటుం దనుకోండి. నే నా రిపోర్టు చూడలేదు. పోలీసులు చూసు కొంటారనుకొంటాను."

"ఐ. సీ. యిప్పుడీ యెస్టేట్ ఆస్థి యెంత వుంటుంది?...."

"రాజామణి భర్తగారి హయాంలో ఎంత వుండేదో తెలియదు. ఆయన తన తమ్ముడితో భాగాలు పంచు కొన్నారు. పదేళ్ళనుంచి వేరుగా వుంటున్నారు. ఇప్పుడీ ఎస్టేట్ ఆస్థి కోటిరూపాయలు దాటి వుంటుంది. ఇక జ్యూవలరీ, బ్యాంక్‌లో ఫిక్సడ్ డిపాజిట్స్ యెంత వున్నాయో రాజామణిగారికే తెలియాలి. వారు చాలా రిజర్వ్‌డుగా వుండేవారు. నేను మేనేజర్ని అయినా బిజినెస్ వ్యవహారాలు మాత్రమే మాట్లాడుతూ వుండే వారు. పర్సనల్ మేటర్స్ యెత్తేవారు కాదు" అన్నాడు వేణుగోపాల్.

"ఇప్పుడు రాజామణి మరదిగారు ఇదే బిజినెస్ చేస్తుం టారా?"

"ఆఁ....ఒకప్పుడు. డివైడ్ అయినప్పుడు ప్రక్కవున్న ఎస్టేట్ వారిదే. కాని ఆయన వ్యసనపరుడు. పేకాట, రేసులు. ఎప్పుడూ మెడ్రాసులోనే మకాం. ఎస్టేట్ మేనేజర్ బాగా తినేశాడు. లాస్‌లో అమ్మేశారు. మెడ్రాస్‌లో ఏదో లాడ్జింగ్ కొని నడుపుతున్నాడనీ, మొత్తానికి బాగా చితికిపోయాడని తెలుస్తోంది."

"ఆయన అప్పుడప్పుడూ యిక్కడికి వచ్చేవాడా?"

"రాకేం. వదినగారిని డబ్బుకోసం పీడిస్తూ వుండే వాడు. ఆమె మూడీ మనిషి. ఒక్కోసారి గౌరవంగానే మాట్లాడేది. అడిగిన డబ్బు ఇచ్చి పంపేది. మరొకసారి కుక్కకన్నా హీనంగా చూసేది. 'గెటవుట్' అని కేకలు పెట్టేది. చూస్తుంటే నాకే బాధనిపించేది" నవ్వాడు వేణుగోపాల్.

"ఎవరో రాజామణిగారిని హత్య చేశారని పుకారు పుట్టిందన్నారు చూశారా? ఎలా పుట్టింది? పొగ రావాలంటే నిప్పుండాలి గదా! ఆమెకు శత్రువులు యెవరైనా వున్నారా? మీకు తెలిసి వుండాలి" అన్నాడు రాయ్.

వేణుగోపాల్ నవ్వాడు.

"భలేవారే. బిజినెస్ వ్యవహారాలు మాత్రమే నాకు తెలుసు. ఆవిడ పర్సనల్ మేటర్స్ నాకు ఏమీ తెలియవు. అందులో యీ బిజినెస్ మీకు తెలియదు. అడవిలో బీడీ ఆకు, విస్తరాకులు కాంట్రాక్టు తీసుకొని ఎక్స్‌పోర్టు చెయ్యడం. లేబర్‌తో డీలింగ్స్ తలనొప్పి అనుకోండి. ఇక వేరే విషయాలు ఆలోచించడానికే తీరిక దొరకదు. కాని...."

రాయప్ప ఆశగా చూశాడు.

"ఈ మధ్య లత పెళ్ళి చెయ్యాలని చూస్తున్నట్లుగా రాజామణి నాతో అన్నారు. లత మేనత్త ఒకామె వుంది లెండి. పూర్ లేడీ. కథ మామూలే. భర్త ఆస్తి పాడుచేశాడు. ఒక్కగానొక్క కొడుకుని గ్రాడ్యేట్ చేసింది. అతని పేరు సురేష్ అనుకొంటాను. ఎస్. సురేష్. అతనికి లతను యివ్వమని గొడవపెడుతూందనీ, కాని తనకు ఇష్టంలేదని ఆవిడ అన్నారు."

"లతకి ఇష్టమేనా?

"ఏమో మరి....?" నవ్వుతూ అన్నాడు వేణుగోపాల్.

ఇంతలో ఎవరో నౌకరు వచ్చాడు వేణుగోపాల్ కోసం. అతను వెళ్తూ "మిష్టర్ రాయ్! మీరు ఏ మాత్రం మొగమాట పడకుండా ఏం కావాలన్నా నాతో చెప్పండి. యిక్కడ వున్నన్నాళ్ళూ మీరు నా గెస్టులు" అన్నాడు.

"ఓ. కే. థాంక్స్" అన్నాడు రాయప్ప.

వేణుగోపాల్ సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

"ఇతను చాలా మంచివాడు. కొత్త పాతా లేకుండా ఎంతో సరదాగా మాట్లాడుతూ వుంటాడు. భోళా మనిషి" మెచ్చుకోలుగా అంది సంధ్య.

"ఎస్....ఎస్. మనం బయల్దేరుదామా! ఎండెక్కుతోంది" అన్నాడు రాయప్ప.

4

"మీరు లోగడ ఏవైనా కేసులు డీల్ చేశారా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నందన్‌కుమార్.

"ఏవో చిన్న చిన్న కేసులు డీల్—చేశాను" అన్నాడు రాయప్ప.

"ఆదాయం ఎలా వుంటుంది?"

"ఫర్వాలేదు. కాని యింకా జనం ప్రైవేట్ డిటెక్టివ్‌లకు కేసులు అప్పగించడానికి అలవాటుపడలేదు. ఎవరో బాగా డబ్బున్నవాళ్ళే తప్ప."

ఇంతలో జవాన్ కాఫీ కప్పులు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

"ప్లీజ్. తీసుకోండి."

"థాంక్స్!" అన్నాడు రాయప్ప.

"పోస్టుమార్టమ్ రిపోర్టు చూస్తారా?"

"నో థాంక్స్! వివరాలు చెప్పండి చాలు" అన్నాడు రాయప్ప.

"ఆమెకు నల్లమందు తీసుకొనే అలవాటు వున్నట్లుంది. ఆ సమయంలో ఆవిడ పూర్తిగా మత్తులో వుంది. తల పగిలి బాగా రక్తం పోవడంవల్ల మరణం సంభవించిందని డాక్టర్ రిపోర్టు రాశాడు."

"ఐ. సీ. నేను గూడా యిటువంటిదే ఏదో వుంటుందనుకొన్నాను లెండి. ఆవిడ నల్లమందు మత్తులో వుందనే విషయం తేలిపోయింది. ఆవిడ అప్పుడప్పుడూ కొండమీద ఆ పాయింట్ వద్దకు వెళ్ళి కాసేపు కూర్చుని వస్తుందని కొందరు చెప్పారు. ఐతే ఆమె వెంట యెవరో ఒకరు తోడు వుంటారని చాలామంది అన్నారు. సరిగ్గా ఆమె చనిపోయిన రోజే యెవరూ వెంట లేకపోవడం గమనార్హం.

ఆ కొండ దిగువన కొందరు లేబర్ గుడిసెలలో వుంటున్నారు. వాళ్ళంతా అడవిలో బీడీ ఆకు సేకరించే పనిలో వాళ్ళే. ఆవిడ కొండమీదనుంచి క్రింద పడినప్పుడు ఆమె అరచిన శబ్దం విన్నారేమోనని చాలామందిని ప్రశ్నించాను. కాని ఎవరూ వినలేదన్నారు. నాకు ఆశ్చర్యం అనిపించింది. సాయంకాలం జరిగింది ఈ సంఘటన.

రాత్రి యెంతకూ తల్లి రాకపోతే కూతురు మనుషుల్ని పంపించింది. కొండ దిగువన కారు మాత్రం కనిపించింది. దాదాపు రెండు గంటలసేపు టార్చిలైట్లు వేసుకొని తిరిగారు. చివరకు ఆమె శవం కనిపించింది."

తల వూపాడు ఇన్‌స్పెక్టర్.

"మీరు యెవరినైనా అనుమానిస్తున్నారా?" ప్రశ్నిం

చాడు రాయప్ప.

"అర్థం కావడంలేదు."

"మీకు ఫోన్ చేసింది ఎవరు?"

"యెవరో తెలీదు. పేరు అడగ్గానే ఫోన్ పెట్టేశాడు...."

"ఫోన్ రాజవరంనుంచి వచ్చిందా?"

"అవును."

"టౌన్‌కి టెలిఫోన్‌లో మాట్లాడాలంటే ట్రంకాల్ బుక్ చెయ్యాలి గదా?"

"అవసరంలేదు. రాజవరం విలేజ్ ఈ టౌన్ ఎక్ఛేంజి లోదే. లోకల్ క్రిందే లెక్క."

"ఆ వూళ్ళో యెవరెవరికి ఫోన్స్ వున్నాయో మీకు తెలుసా?"

"రాజామణిగారికి, వాళ్ళ మేనేజర్ ఇంటికి తప్ప ఎవరికీ లేవు. పోస్టాఫీసులో మాత్రం వుంది."

"పోస్టుమాస్టర్ చేసి వుంటాడా?"

"అడిగాను. తనకి తెలియదన్నాడు" అన్నాడు నందన్ కుమార్.

"ఎవరో రాజామణి మరణాన్ని హత్యగా క్రియేట్ చెయ్యాలని ప్రయత్నిస్తున్నట్లుగా వుంది."

"కావచ్చు."

"మీరు ఎవర్నయినా అరెస్టు చేశారా?"

"ఎలా?" నవ్వాడు నందన్‌కుమార్.

"రాజామణి మరణం ప్రమాదవశాత్తు జరగలేదనీ, ఎవరో హత్య చేశారని ఆమె కూతురు హేమలత అనుమానపడుతోంది."

"ఈజిట్....?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఇన్

స్పెక్టర్.

"ఎస్."

"అయితే ఇందులో ఏదో మిస్టరీ వుంది మిస్టర్ రాయ్. అది మీరే కనిపెట్టాలి" అన్నాడు.

"ష్యూర్. విత్ యువర్ కైండ్ కోపరేషన్" నవ్వుతూ అన్నాడు రాయప్ప.

"సర్టెన్లీ."

"గుర్తుంచుకోండి. నేను మీ క్లాస్‌మేట్‌ని. డిటెక్టివ్‌ని కాదు. ఓ. కే."

"ఓ. కే."

"థాంక్స్."

సెలవు తీసుకొని పోలీస్ స్టేషన్ నుంచి బయటపడ్డాడు రాయప్ప.

5

కొండ మలుపు వెళ్ళే సిటీబస్ రెడీగా వుంది. అందులో వెళ్తే రాజవరం స్టాప్‌లో దిగొచ్చు. రాయప్ప బస్సులో యెక్కి కూర్చున్నాడు. కొండమలుపు ఆ రూట్‌లో చివరి స్టేజి.

రాజవరం రోడ్డుమీద దిగేసరికి చీకటిపడింది. అతని వెనుక నలుగురు బస్సు దిగారు. అందులో ఇద్దరు బీడీ ఆకు కార్మికులు. బ్యాటరీలైటు వేసుకొని వడివడిగా వెళ్ళిపోయారు.

రాయప్ప కాసేపు నిల్చున్నాడు రోడ్డుమీదే.

అతను యెవరో చొరవగా వచ్చి అగ్గిపెట్టెను అడిగాడు.

పరీక్షగా చూశాడు రాయప్ప.

కుర్రాడే. చామనఛాయలో వున్నాడు. బ్లూ కలర్ స్ట్రైట్ ప్యాంట్‌లో వయిట్ షర్టు టక్ చేశాడు. ఎత్తుగా బలంగా కన్పించాడు. కళ్ళు ఎర్రగావున్నాయి. బహుశా కొంచెంగా నయినా త్రాగి వుండాలను కొన్నాడు.

సిగరెట్ ముట్టించి అగ్గిపెట్టె తిరిగి ఇచ్చేస్తూ "పోలీస్ స్టేషన్‌కి ఎందుకు వెళ్ళారు?" అన్నాడు.

రాయప్ప బ్రేక్ వేసిన బండిలా ఠక్కున ఆగిపోయాడు. విస్మయంగా చూశాడు అతని వంక.

ఎవరు ఇతను? తను పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి వచ్చినట్లు ఎలా తెలుసుకొన్నాడు.

"ఆగిపోయారేం?" అన్నాడతను సిగరెట్ పొగ ఆకాశంలోకి వదులూ.

"ఎవరు మీరు?"

"నేనెవరో మీకు తెలియదు. కాని మీరెవరో నాకు తెలుసు?"

గుండె జల్లుమంది రాయప్పకి. కొంపదీసి వీడేనా రాజామణిని చంపిన హంతకుడు? తను డిటెక్టివ్ నని కని పెట్టేశాడా? అతని ప్యాంట్ జేబుల వంక చూశాడు. ఎత్తుగా కనిపించింది. ఆ జేబుల్లో పిస్టల్, కత్తి వంటివి లేవుగదా?

"మీరు మా లత క్లాస్‌మేట్. సంధ్యను మీరు పెళ్ళి చేసుకోబోతున్నారు. కాని హనీమూన్ మాత్రం వచ్చేశారు పెళ్ళి కాక ముందే...." అతను పక పక నవ్వాడు.

"ఎవరు మీరంటే చెప్పరేం?"

"నేను లతకి మేనత్త కొడుకుని. నా పేరు సురేష్."

'హమ్మయ్య' అని తేలిగ్గా వూపిరి పీల్చుకొన్నాడు.

"గ్లాడ్ టూ మీట్ యూం!" అని షేక్ హేండ్ ఇచ్చాడు రాయప్ప.

"నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు మీరు."

"ఏమిటది?"

"పోలీస్ స్టేషన్‌కి వెళ్ళిన సంగతి."

"మరేంలేదు. ఇన్‌స్పెక్టర్ నందనకుమార్ అని నా క్లాస్ మేట్ ఒకడున్నాడు. వాడిని కలుసుకోవడానికి వెళ్ళాను" అన్నాడు రాయప్ప.

"అలాగా!" అని నవ్వాడు సురేష్.

ఇద్దరూ నడవసాగారు.

"నేను సరదాగా వచ్చాను సంధ్య రమ్మని లెటర్ రాస్తే. తీరా వచ్చేసరికి ఇంత దారుణం జరిగిపోయింది. అదే మీ అత్తయ్యగారు చనిపోవడం."

"చనిపోవడం కాదు. చంపబడింది" నెమ్మదిగా అన్నాడు సురేష్.

"నిజమా?...." యెంతో ఆశ్చర్యం ప్రకటించాడు రాయప్ప.

"ఎస్."

"మీ కెలా తెలుసు?"

"తెలుసు అంతే."

"ఆమెను చంపితే ఎవరికేం లాభం?"

"వుంది కొందరికి."

"బాగుందండీ మీరు చెప్పడం. ఆమె కోటీశ్వరురాలు. ఆమెకు ఒక కూతురుంది. ఆమె చనిపోతే ఆస్తికి వారసురాలు కూతురు గాని వేరే వాళ్ళు యెలా అవుతారు?"

"వారసులే కానక్కరలేదు" అన్నాడు సురేష్.

"మరి ఆమెను చంపి లాభం ఏమిటి? అసలు రానప్పుడు" అన్నాడు రాయప్ప.

రాజవరం పొలిమేరలు వచ్చేవరకూ రాయప్ప అతన్ని లాంగదీసుకోలేకపోయాడు. ఎవరో చంపారని అంటాడు గాని యెవరో చెప్పడు. యెన్నో విధాల మెలికలువేసినా బైటపెట్టలేదు అతను.

ఊరి మధ్యలోఒక టీకొట్టులో గుడ్డిగా వెలుగుతోంది లాంతరు. పూరిపాకలో వుంది ఆ టీకొట్టు. పకోడీలు, బజ్జీలు అడుగు బొడుగూ వున్నాయి. లడ్డూలు పేర్చి వున్నాయి పళ్ళెంలో.

"లోపల కూర్చుందాం రండి. కొంచెం కంపెనీ ఇవ్వండి" అన్నాడు సురేష్.

ఇద్దరూ లోపలకెళ్ళి చెక్కబల్లమీద కూర్చున్నారు. టీ త్రాగడానికేమో అనుకొన్నాడు రాయప్ప.

కాని అతగాడు జేబులోంచి ఓల్డు టావరిన్ విస్కీ బాటిల్ తీసి రెండుగ్లాసులు తెప్పించాడు. పకోడీలు, బజ్జీలకి ఆర్డర్ ఇచ్చాడు.

"నాకు అలవాటు లేదు ప్లీజ్ ...." అన్నాడు రాయప్ప.

"భలేవారే. ఈ రోజుల్లో మీ లాంటి వారుండడం ఆశ్చర్యం. కొంచెంగా తీసుకోండి" అని బ్రతిమాలాడు.

అప్పటికే అతను టౌన్‌లో త్రాగి వచ్చాడు. నిషా దిగిపోయిందేమో మళ్ళీ మొదలుపెట్టాడు. 'త్రాగుడికి బానిస' అనుకున్నాడు రాయప్ప.

"మీరు బలవంతం చేస్తే నేను వెళ్ళిపోతాను" అన్నాడు రాయప్ప.

"నో. వెళ్ళకండి. మీ రెళ్ళిపోతే మరీ బోర్" అంటూ

నెమ్మదిగా బాటిల్ ఖాళీ చేశాడు.

కాసేపటికి బయలేరారు.

"మీరు చెప్పనేలేదు ఆ విషయం?" అంటూ మళ్ళీ కదలేశాడు రాయప్ప.

"ఏ విషయం?"

"అదే మీ అత్తయ్యను మర్డర్ చేసిన వ్యక్తి."

"అది రహస్యం గురుగారూ! చెప్తే చానా ప్రమాదం. వాడుట్టి గూండా."

"మనల్నేం చేస్తాడు. మనమేమన్నా అతన్ని అడుగుతామా? మనం ఫ్రెండ్స్. ఏవేవో చెప్పుకుంటూ వుంటాం. అంతే. తర్వాత మర్చిపోతాం."

"అయితే వెంటనే మర్చిపోతారా?"

వెంటనే. నాకసలు మతిమరుపు గూడా!"

"అయితే వెరీగుడ్. మా అత్తయ్యని మర్డర్ చేసిన వాడు మా మామయ్య."

రాయప్పకి నవ్వు వచ్చింది. నవ్వితే ఎందుకు నవ్వావని ప్రాణం తీస్తాడేమోనని బలవంతాన ఆపుకున్నాడు.

"భలేవారే. మీ అత్తయ్య విడోకదా! మర్చిపోయారా? నాకంటే మతిమరుపు మనిషిలా వున్నారే మీరు. చచ్చిపోయిన మీ మామయ్య యెలా మర్డర్ చేస్తాడు?" ఎగతాళిగా నవ్వాడు.

"మావయ్యంటే చచ్చినవాడు కాదు."

"మరి?"

"బ్రతికివున్నవాడొకడున్నాడు. చిన్నమావయ్య."

రాయప్ప అదిరిపోయాడు ఆ మాట విని.

"ఈ జిట్ కరెక్టా?"

"యస్ గురూ! యస్."

"ఎక్స్క్యూజ్ మీ! నాకు తెలియక అడుగుతున్నాను. మీ అత్తయ్యని చంపితే అతనికి లాభం ఏమిటి? ఆస్తి యెప్పుడో పంచుకున్నారుగదా?" అని ప్రశ్నించాడు రాయప్ప.

"ఆయన్ని డైరెక్ట్ లాభంకాదు. ఇన్ డైరెక్టు లాభం. ఆయనకొక బామ్మర్ది వున్నాడు. చాల బుద్ధిమంతుడు. పదేళ్ళనుంచి డాక్టర్ కావాలని తెగ ట్రై చేస్తున్నాడు. పాపం యింకా కాలేదు. వాడికి తన అన్నకూతుర్నిచ్చి పెళ్ళిచేసి ఎస్టేట్ బిజినెస్ గుప్పిట్లో పెట్టుకోవాలని ప్లాన్‌లో వున్నాడు. అందుకు మా అత్తయ్య ఒప్పుకో లేదు. అందుకే చంపాడు. ఇప్పుడిక యెదురేముంది. లత తల్లిదండ్రులు లేని పిల్ల. పినతండ్రిని నమ్ముకుంది, కసాయి వాడిని మేకపిల్ల నమ్మినట్లు" అన్నాడు సురేష్.

రాయిప్ప బుర్ర తిరిగిపోతూవుంది అతను చెప్పేదంతా వింటూవుంటే.

6

"లతా! ఈ పరిస్థితులలో నా దొక సలహా" అన్నాడు రాయప్ప.

ఏమిటన్నట్లు తలెత్తి చూసింది లత.

"ఇక నువ్వు ఎంతమాత్రమూ ఒంటరిగా వుండడం మంచిదికాదు. వీలైనంత త్వరలో పెళ్ళిచేసుకోవాలి" అన్నాడు.

లత తల వంచుకుంది ఏదో ఆలోచిస్తూ.

"మీ చినాన్న నాగభూషణం నీ బాధ్యత వహిస్తాడని అనుకుంటున్నాను. ఆయన ధోరణి చూస్తే అందుకు సిద్ధం గానే వున్నాడనిపించింది. ఆయన బామ్మర్ది వున్నాడట, యం.బి.బి.యస్. స్టడీస్‌లో వున్నాడట. అతనికిచ్చి నీ

పెళ్ళి జరిపించాలని ఉద్దేశ్యంలో వున్నాడు. మీ అమ్మతో సంప్రదించాలని అన్నాడు. కాని ఆవిడ ఏ సంగతీ చెప్ప లేదని అంటున్నాడు."

లత మౌనంగా వుండిపోయింది.

"నీకు యిష్టమేనా?" అంది సంధ్య స్నేహితురాలిని.

ఇష్టంలేదని తల వూపింది లత.

"పోనీ మీ బావ సురేష్ అంటేనో? తన కొడుకుని నువ్వు పెళ్ళి చేసుకోవాని పాపం చాల ఆశతో వుంది" అన్నాడు రాయప్ప.

"అతన్ని నేను పెళ్ళిచేసుకోవడం కల్ల" అంది లత కొంచెం కోపంతో.

"ఏం?"

"అతని ప్రవర్తన మంచిదికాదు. ఎన్నో వ్యసనా లున్నాయి. చూడ్డానికి అందంగా మేడిపండులా వుంటాడు" అంది లత.

"మీ బంధువుల్లో యెవరూ నీకు తగినవారు లేరను కుంటాను. బైట సంబంధాలు చూసుకోవాలి. నువ్వు ఏమీ అనుకోనంటే నా ఫ్రెండ్ ఒకడున్నాడు. వాడి పేరు శ్రీధర్. మంచి పొజిషన్‌లో వున్నాడు. డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నాడు. త్వరలోనే జిల్లాకలెక్టర్ ప్రమోషన్ రాబోతున్నది. అందంగా వుంటాడు. మంచి పర్సనాల్టీ."

"సారీ! రాయప్ప. నా మనసులో ఒకరున్నారు. అతన్ని పెళ్ళాడాలనుకుంటున్నాను" అంది లత.

"నేను తెలుసుకోవచ్చా?"

"మీకు తెలుసు అతను. మా ఎస్టేట్ మేనేజర్ వేణు గోపాల్. నేను ప్రేమించాను అతన్ని" లత సిగ్గుపడింది.

ఉంగరాల క్రాఫుతో ఎత్తుగా హీరోలా వుండే వేణు గోపాల్ రాయప్ప మనసులో మెదిలాడు.

ఇంతలో సోనీ వచ్చింది "అమ్మా! బాబాయి పిలుస్తున్నాడు" అంది.

"మీరు కూర్చోండి. ఇప్పుడే వస్తాను" అని వెళ్ళింది లత.

ఆమె వెనుక సోనీ గూడా వెళ్ళిపోయింది.

"శ్రీధర్ ఎవరు రాయ్! మన జూనియరేనా?" ప్రశ్నించింది సంధ్య.

"కాదు. మన జూనియర్ అప్పుడే డిప్యూటీ కలెక్టర్ యెలా అవుతాడు?" నవ్వాడు రాయప్ప.

"మరి యింకెవరు?"

"అసలు శ్రీధర్ అనే డిప్యూటీ కలెక్టర్ యెవరూ లేరు. క్రియేటెడ్ కలెక్టర్" నవ్వుతూ అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది సంధ్య.

"లత మనసు తెలుసుకోవాలని అలా నాటకం ఆడాను."

"అయితే వాళ్ళ బంధువుల్లో ఒకరు వాళ్ళమ్మను చంపించి వుంటారేమో?" అంది సంధ్య.

రాయప్ప సిగరెట్ వెలిగించి పొగ వూదుతూ అటూ యిటూ పచార్లు చేస్తూ "ఆ విషయమే తీవ్రంగా ఆలోచిస్తున్నాను" అన్నాడు.

కాసేపటికి లత వచ్చింది. ఆమె వెనుకే సోనీ కాఫీ కప్పులున్న ట్రే తీసుకొచ్చి టీపాయ్‌మీద పెట్టి వెళ్ళిపోయింది.

"లతా, మీ ప్రేమ సంగతి మీ అమ్మకి తెలుసా?"

"తెలుసు. నేనే చెప్పాను."

"ఏముంది ఆమె?"

"అంతా నా ఇష్టం అంది."

"అయితే మీ అమ్మకు మీ పెళ్ళి ఇష్టమేనన్న మాట" అన్నాడు రాయప్ప.

తల వూపింది లత.

"మీ అమ్మను ఎవరైనా హత్య చెయ్యడానికి అవకాశం వుందా?" ప్రశ్నించాడు రాయప్ప.

"నాకు అనుమానంగా వుంది. కాని ఫలానా అని చెప్పలేకపోతున్నాను" అంది లత.

"మీ అమ్మకి నల్లమందు తీసుకొనే అలవాటుందని డాక్టర్ రిపోర్టులో తేలింది. ఆ సంగతి నీకు తెలుసా?"

"నాకు తెలియదు" అంది లత.

"ఆమెకు ఆ అలవాటు చాల యెక్కువగా వుంది. నిద్రపోయే ముందు తీసుకుని నిద్రపోవడం ద్వారా అలవాటై వుంటుంది. క్రమంగా పగలుగూడా తరచుగా తీసుకోవడానికి అలవాటుపడింది. ఈ సంగతి మీకు తెలియకపోవడం చాల ఆశ్చర్యంగా వుంది."

"నిజంగా నాకు తెలియదు" అంది లత.

"నల్లమందు నిషిద్ధ వస్తువు. అది ఆమెకు యెవరు సప్లై చేసేవారో తెలుసుకోవలసి వుంది" అన్నాడు రాయప్ప.

"ఇప్పుడు ఎవరు చెప్తారు?" అంది సంధ్య.

రాయప్ప నవ్వి "ఈ గది మీ అమ్మగారు ఉపయోగించేవారా?" అన్నాడు చుట్టూ కలయజూస్తూ.

"అవును."

"ఈ గది నేను ఇన్వెస్టిగేట్ చెయ్యాలనుకుంటున్నాను. అభ్యంతరమా?"

లేదన్నట్లు తల వూపింది లత.

రాయప్ప పరిశోధన ప్రారంభించాడు.

గాడ్రెజ్ స్టీల్ బీరువాలో సేఫ్టీలాక్ ఓపెన్ చెయ్యగానే కనిపించింది నల్లమందు ఒక సీసాలో. న్యూస్ పేపర్ చుట్టబడింది సీసాచుట్టూ.

"చూశావా లతా! నల్లమందు" సీసా లతకి అందించాడు.

లత ఆశ్చర్యంగా చూసింది.

రాయప్ప న్యూస్ పేపర్ విప్పి పరీక్షగా చూశాడు. ఒక మూల వారం రోజుల క్రితం తారీఖు వుంది. ఎవరిదో సంతకం చేసివుంది పేపరుమీద. జాగ్రత్తగా చూస్తే ఆ సంతకం 'షణ్ముగం' అనే అతనిది.

రాయప్ప గబగబా హాల్లోకి వెళ్ళి ఫోన్లో పోలీస్ స్టేషన్‌కి రింగ్ చేశాడు.

"యస్.ఐ. స్పీకింగ్" అని వినిపించింది అవతల నుంచి.

"హలో నందన్‌కుమార్."

"యస్."

"నేను రాయ్‌ని మాట్లాడుతున్నాను. రాజవరం నుంచి."

"రాయ్! గుడ్ మార్నింగ్. ఏమిటి విశేషాలు? యెంత వరకు వచ్చింది మీ పరిశోధన."

"దార్లోనే వుంది. ఇంకా ఒక క్లూ దొరకలేదు. ఇప్పుడొక ముఖ్యమైన సమాచారం కావాలి. రాజామణి గదిలో నల్లమందుసీసా దొరికింది. ఆ సీసా ఒక న్యూస్ పేపర్లో చుట్టివుంది. దానిమీద షణ్ముగం అనే సంతకం వుంది. ఎవరో ఈ షణ్ముగం అనే విషయం కావాలి. న్యూస్ ఏజంట్ ద్వారా కనుక్కోవచ్చు. బహుశా యీ షణ్ముగం అనే వాడే రాజామణికి నల్లమందు సప్లై

చేస్తూ వుండివుండాలి. ఎవరిద్వారా నల్లమందు పంపే వాడో కనుక్కుంటే కొంత క్లూ దొరుకుతుంది" అన్నాడు రాయప్ప.

"అలాగే. నేను కనుక్కుని ఫోన్ చేస్తాను.

"ఓ.కే. థాంక్స్."

"నో మెన్షన్."

ఫోన్ పెట్టేసినట్లు కిక్‌మని శబ్దం వచ్చింది. రిసీవర్ క్రెడిల్ మీద పెట్టేశాడు రాయప్ప.

7

ఎదురు చూసి చూసి విసుగుపుట్టింది రాయప్పకి.

సంధ్యకాంతులు మాసిపోతున్నాయి.

చీకటి తెరలు క్రమ్ముకొస్తున్నాయి.

కొండచివర విశాలమైన రాతిమీద కూర్చున్నాడు రాయప్ప ప్రకృతి దృశ్యాల అందాలను తిలకిస్తూ.

చీకటిపడితే కొండ దిగటం కష్టం. అంతేకాదు, పాములు, తేళ్ళు వంటివి తారసపడవచ్చు కూడా. అందుకే బ్యాటరీలైటు వెంట తెచ్చాడుగూడా.

చీకటి పడకముందే వస్తానని మాట ఇచ్చింది సోనీ.

ఇంకా రాలేదు.

వస్తుందా? రాదా?

రాయప్ప మనస్సు ఎక్కడో వుంది.

మువ్వలు చప్పుడు చేసినట్లు సన్నటి నవ్వు వినిపించింది. వెనక్కి తిరిగి చూశాడు.

సోనీ నవ్వుతూ కనిపించింది.

ఆకుపచ్చటి చీర మాచింగ్ బ్లవుజు. ఆమె పచ్చటి పూలు పెట్టుకుంది.

మసకచీకట్లో కన్యలా కనిపించింది.

"ఇంత ఆలశ్యం చేశావేం? ఇక రావనుకున్నాను" అన్నాడు.

"ఏమిటో చెప్పు" అంటూ చొరవగా వచ్చి దగ్గర్లోనే కూర్చుంది.

రాయప్ప కవరు ఆమె చేతికిచ్చాడు.

కవరులో నుంచి తీసింది ఒక ఫోటో. అతను బ్యాటరీ స్విచ్ నొక్కాడు! అందులో తన ఫోటో చూసి ఆశ్చర్యపోయింది సోనీ.

"ఎప్పుడు తీశావ్?" ఆశ్చర్యపోయింది.

"నీకు తెలియకుండా తీశా! ఎలా వుంది?"

"ఎలా వుందో నువ్వే చెప్పు" అంది నవ్వుతూ.

"ఇదుగో ఈ సినిమాపత్రిక చూశావా?"

సోనీ అందుకుని చూసింది ముఖచిత్రం.

"అట్టమీద బొమ్మ యెవరిదో తెలుసా. ఆవిడ పేరు హైమ. ఇప్పుడు ఇరవై సినిమాల్లో నటిస్తోంది. సినిమాకి యెంతో తెలుసా?"

"ఎంత?"

"మూడులక్షలు" అన్నాడు.

"అమ్మో!" అంది సోని గుండెలమీద చెయ్యివేసుకుని.

"అది తెలుగులో అయితే. హిందీ సినిమా అయితే సినిమాకి పదిలక్షలు యిస్తారు."

సోని ముఖం ఆశ్చర్యంలో మునిగిపోయింది.

"ఆ హైమ నీ ముందు బలాదూర్" అన్నాడు.

సోని గర్వంగా చూసింది అతని వంక.

"నీ అందం నీకు తెలియదు సోనీ. ఈ మారుమూల పల్లెటూళ్ళో నీ అందం వృధాగా అయిపోతోంది. ఒకళ్ళ ఇంట్లో పనిమనిషిగా వుండే కర్మ నీకేం పట్టింది?"

"ఏం చెయ్యను నా కర్మ" విచారంగా అంది సోని.

"నీకు పెళ్ళి కాలేదా?"

"లేదు. ఒకడు నన్ను పెళ్ళిచేసుకుంటానని మోసంచేసి వదిలేశాడు బెంగుళూరులో. చచ్చీచెడి ఇల్లు చేరుకున్నాను. నేను ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్ళిపోయానని మా అమ్మ దిగులుతో చచ్చిపోయింది."

"ఎవరూ లేరా నీకు?"

"మా అన్నయ్య వున్నాడు."

"ఏం చేస్తుంటాడు?"

"రాజామణిగారి ఎస్టేట్‌లో వాచ్‌మాన్‌గా పని చేస్తున్నాడు. వట్టి తాగుబోతు. నా గురించి పట్టించుకోడు ఎదవ" నవ్వింది సోని.

"ఇంకేం మరి. అదృష్టం నీ చేతిలోవుంది. నువ్వు తల్చుకుంటే కోట్లు సంపాయించగలవు" అన్నాడు రాయప్ప.

"ఎలా?"

"సినిమాల్లో జేర్పిస్తాను నా వెంట రా."

"నిజంగా నేను పనికి వస్తానా?"

"బ్రహ్మాండంగా. అదంతా నీ కెందుకు? నువ్వు వూఁ అను చాలు. మిగతాదంతా నేను చూసుకుంటాను గదా."

సోని ఆలోచనలో పడిపోయింది.

రాయప్ప నెమ్మదిగా సోని చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. సోని సిగ్గుపడుతూ అతని గుండెల్లో తల దాచుకుంది.

"ఏమంటావు సోనీ."

"నీ ఇష్టం."

"నువ్వు బాగా డబ్బు సంపాదించాక నన్ను మర్చిపోవు గదా?" అన్నాడు.

"ఛీ....నిన్ను మర్చిపోతానా? అసలు నిన్ను వదిలి పెట్టను."

"ఏం చేస్తావ్ వదలక. పట్టుకుంటావా?"

"ఆఁ....నిన్నే పెళ్ళి చేసుకుంటాను" అంది సోని.

రాయప్ప "నిజంగా" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"నిజం" అని ఆతని అరచేతిని గిచ్చింది.

కాసేపైన తర్వాత బ్యాటరీలైటు వెలుగులో యిద్దరూ కొండ దిగారు. వూరి పొలిమేర్లలోకి వచ్చాక "మా ఇంటికి రారాదూ!" అంది సోని.

"ఇంట్లో మీ అన్న లేడా?"

"ఈ రోజు నైట్ డ్యూటీ. అన్నం తిని వెళ్ళిపోయి వుంటాడు ఈ పాటికి." మత్తుగా చూసింది సోని వళ్ళు విరుచుకొంటూ.

సోని అందాలు చూసి రాయప్ప మనసు పీకింది. బల వంతాన నిగ్రహించుకొన్నాడు.

"తొందరెందుకు? యెవరైనా చూస్తే గొడవ" అన్నాడు.

"అంత భయమా?" అంది.

"భయంకాదు. నీ మీద భక్తి. నీ అందం అనుభవించ డానికి కాదు. ఆరాధించడానికి."

అర్థం కానట్లు చూసి నవ్వుతూ వెళ్ళిపోయింది సోని.

రోడ్డు మలుపు తిరగబోతూండగా ఎవరో వెనుక తల మీద బలంగా కొట్టారు. కెవ్వున కేకపెట్టి విరుచుకు పడి పోయాడు రాయప్ప.

8

తలకి కట్టు కట్టుకొని కూర్చున్న రాయప్ప ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు ఎస్టేట్ మేనేజర్ వేణు

గోపాల్.

"చాలే ఆశ్చర్యంగా వుందే? మీకు శత్రువులు ఎవరున్నారు ఇక్కడ?" అన్నాడు.

"నాకు అదే అర్థం కావడం లేదు...." అన్నాడు రాయప్ప.

"ఇంకా నయం. కొద్దిలో తప్పిపోయింది. లేకపోతే ప్రాణాం పోయి వుండేది" అంది సంధ్య.

"నేను ఈ రోజు వెళ్ళిపోదామనుకొన్నాను. ఇంతలో ఈ దెబ్బ తగిలింది."

"అప్పుడే వెళ్ళిపోతారా? రాజామణిగారి పెద్ద కర్మ అయ్యేవరకూ వుండండి. మీరు వుండబట్టి హేమలత కాస్త ప్రశాంతంగా వుండగలుగుతోంది" అన్నాడు వేణుగోపాల్.

"నేను వెళ్ళినా సంధ్య వుంటుంది లెండి" అన్నాడు రాయప్ప.

"నేను వెళ్ళరానా? టౌన్‌కి వెళ్ళి వాగన్స్ బుక్ చేసి తీరాలి. నర్సాపూర్ పార్టీ టెలిగ్రామ్స్‌మీద టెలిగ్రామ్స్ కొడుతున్నారు సరుకుకోసం. రెండు రోజుల్లో సరుకు పంపకపోతే సరాసరి ఎస్టేటుకి వచ్చేసి గొంతుమీద కూర్చుంటారు" అన్నాడు నవ్వుతూ.

"వెళ్ళిరండి" అన్నాడు రాయప్ప.

"సీ. యూ!" అని చెయ్యి వూపుకొంటూ వెళ్ళాడు వేణుగోపాల్.

అతను అటు వెళ్ళగానే నౌకరు వెంకన్న గదిలోకి వచ్చాడు. అతను ఏదో చెప్పడానికి వచ్చినట్లు వుంది. ఎందుకో తటపటాయిస్తున్నాడు.

"ఏమిటి వెంకన్నా?" అంది సంధ్య.

"బాబుగారిని కొట్టినవాడిని నేను చూశానమ్మా!" అన్నాడు వెంకన్న.

"ఎవరతను?"

వెంకన్న అటూ ఇటూ చూసి "వాడు రాములు." అన్నాడు.

"రాములు యెవరు?"

"మన గోడౌన్ వాచ్‌మాన్."

"వాడెందుకు కొట్టాడు?" కోపం వచ్చింది సంధ్యకి.

"నేను నిన్న బస్సు దిగి వచ్చానమ్మా. బాబుగారూ, సోని మాట్లాడుకుంటూ వెళ్ళారు కొంత దూరం. తర్వాత సోని వాళ్ళింటికి వెళ్ళిపోయింది. బాబుగారు ఒంటరిగా పోతున్నప్పుడు రాములు వెనుకనుంచి కర్రతో కొట్టాడు. నన్ను చూసి పారిపోయాడు."

ఎర్రగా చూసింది సంధ్య రాయప్ప వైపు.

రాయప్ప దొంగలా దిక్కులు చూశాడు.

"రాములుకి సోనికి ఏం సంబంధం?" అన్నాడు.

"వాడు దానికి అన్న బాబుగారూ!" అన్నాడు వెంకన్న.

"అలాగా! అయితే అర్థమైందిలే!" అన్నాడు రాయప్ప నవ్వుతూ.

వెంకన్న వెళ్ళిపోయాడు.

"వూఁ....సోనీ వెంటపడ్డారన్న మాట. కుక్కబుద్ధి" అంది సంధ్య కోపంగా.

"ఛీ....దానివెంట పడే ఖర్మ యెందుకు నాకు నువ్వుండగా!"

"తెలిసిందిగా అబ్బాయిగారి సంగతి. దానితో తిరగడం చూసి దాని అన్న బాగా తగలనిచ్చాడుగా!

బాగా బుద్ధి చెప్పాడులే," రుసరుసలాడింది సంధ్య.

"నేను తిరుగుబోతునా? దాని చుట్టూ తిరగడానికి? దానివల్ల కొంత సమాచారం రాబట్టడానికి కొంత నాటకం ఆడుతున్నాను. అంతే. నీవిూద ఒట్టు," అన్నాడు

వెంకన్న మళ్ళీ వచ్చాడు.

"బాబుగారూ, మీకు ఫోన్ వచ్చిందట. అమ్మగారు పిలుచుకురమ్మన్నారు." అన్నాడు.

"వస్తున్నా పద," అని నెమ్మదిగా వెళ్ళి రిసీవర్ ఎత్తాడు.

"రాయ్ స్పీకింగ్ ప్లీజ్."

"హల్లో రాయ్! నేను ఇన్‌స్పెక్టర్ నందన్‌ను మాట్లాడుతున్నాను. ఆ షణ్ముగం యెవరో తెలుసుకున్నాను. అతను ఈ టౌన్ వాడే. పొగాకు వ్యాపారం. నాలుగు తగలనిస్తే నిజం చెప్పాడు. వాడు నల్లమందు అమ్మే మాట నిజమేనట. రాజామణిగారికి వీడే నల్లమందు సప్లై చేస్తుంటాడట."

"ఎవరిద్వారా?"

"ఎవడో రాములట. రాజామణిగారి ఎస్టేట్‌లో నే పని చేస్తుంటాడట. వాడే అప్పుడప్పుడూ వస్తుంటాడట"

"వెరీగుడ్. నేను ఈ వెనింగ్ టౌన్‌కి వస్తున్నాను."

"ఓ. కే."

రాయప్ప ఫోన్ పెట్టేసి, ఆలోచనలో పడిపోయాడు.

9

ప్యారడైజ్ హోటల్లోకి ప్రవేశించారు సోని, రాయప్పలు.

అప్పుడే సినిమా చూసి వచ్చారు ఇద్దరూ.

లాక్ తీసి తలుపులు తెరిచాడు రాయప్ప.

"సినిమాహాల్లో అంతా నావైపే చూస్తుంటే సిగ్గేసింది." అంది సోని సిగ్గుపడుతూ.

"ఎవడికోసం చూస్తారు? నీ అందం" అంత గొప్పది. నేను చెప్తుంటే విన్నావూ? రేపు సినిమాల్లో చేరాక నువ్వుంటే చాలు ఎగబడి వస్తారు జనం.

"నువ్వు మరీ ....."అంది సోని మెలికలు తిరిగిపోతూ.

గులాబీరంగు షిఫాన్ చీర, అదేరంగు బ్లౌజు, చెవులకు రింగులు, మెడలో రాళ్ళ నెక్లెస్, రెండు జడలలో చామంతి పువ్వులు, తామరపువ్వులవంటి కాటుక కళ్ళతో సోని అప్సరసలా మెరిసిపోతూంది.

రాయప్ప ఆమె నడుం చుట్టూ చేతులువేసి ముందుకు లాక్కున్నాడు.

సోనీ ఆవేశంతో అతని క్రాఫులోకి వేళ్ళు పోనిచ్చి చిందరవందర చేసేసింది.

టక్ .... టక్ .... టక్.

"ఎవరో వచ్చారు!" సోనీ కంగారుగా లేవబోయింది.

రాయప్ప ఆమెను వదలేదు.

"ఎవడో రూమ్‌బాయ్ లే. వాడే పోతాడు,"అన్నాడు

టక్ .... టక్ .... టక్.

"ఎవరూ?" గట్టిగా అన్నాడు.

"తలుపు తెరువు."

రాయప్ప విసుగ్గా వెళ్ళి బోల్టు తీశాడు.

తలుపులు తెరవగానే పోలీసులు లోనికి వచ్చారు విసురుగా.

"పదండి స్టేషన్‌కి."

"ఎందుకు?" అన్నాడు రాయప్ప వెలవెలపోతూ.

"ఎందుకేమిటి? ఆ పిల్ల ఎవరు? నువ్వు రాజవరంనుంచి లేపుకుని వచ్చావు. బ్రోతల్ కేసు క్రింద అరెస్ట్ చేస్తున్నాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏయ్ పద...." లాఠీతో నెట్టాడు సోనీని.

సోనీకి యేడుపు ముంచుకొచ్చింది.

రాయప్పవంక చూసింది దీనంగా.

'తప్పదు పద' అన్నట్లు తల వూపాడు రాయప్ప.

భారంగా అడుగులు వేసింది సోని.

10

"వెల్‌కమ్ మిస్టర్ రాయ్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నందన్‌కుమార్.

"థాంక్ యూ! నాకోసం ఎదురు చూస్తూ వున్నందుకు" అన్నాడు రాయప్ప ఛైర్‌లో కూర్చుంటూ.

"నో మెన్షన్. నేరస్థుల్ని పట్టుకోవడానికి తప్పదు మరి," అన్నాడు.

"ఎవరు నేరస్థులు?"

"మీరే చెప్పాలి." నవ్వుతూ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేను కాదు సోనీ చెప్తుంది," అన్నాడు రాయప్ప సోనీవైపు కొంటెగా చూస్తూ.

సోనీకి అంతా అయోమయంగా వుంది. రాయప్ప తనతో పాటు ముద్దాయిగా రావటాం, ఇక్కడికొచ్చాక పోలీసులతో కుమ్మక్కయిపోవడం చూసి మతి పోయినట్లయింది.

"నీ పేరు సోనీయా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

తల వూపింది అవునన్నట్లు.

"మీ అమ్మగారు రాజామణి వెంట ఎక్కువగా షికారుకెళ్ళేది నువ్వే కదూ!"

"నేనేకాదండీ ముత్యం, రత్నం గూడా వెళ్తుంటారు"

అంది సోని.

"మీ అమ్మగారు చనిపోయిన రోజు నువ్వు పనిలోకి వెళ్ళలేదు. అవునా?"

"వంట్లో బాగోలేక వెళ్ళలేదండి."

"అంతకు ముందురోజు గూడా వెళ్ళలేదు. అవునా?"

"అవునండి."

"మరి ఆ రోజు మీ అమ్మగారివెంట యెవరు వెళ్ళారు షికారు."

"ఎవరూ వెళ్ళలేదండి!" అంది సోని భయంగాచూస్తూ.

"ఎవరూ వెళ్ళలేదని యెలా తెలుసు నీకు?" దబాయించాడు యిన్‌స్పెక్టర్.

"మరండి....మరండి...." ఏం చెప్పాలో తోచక సోని మాటలు తడబడ్డాయి.

"చెప్పు. నువ్వు మీ అమ్మగారు కొండ ఎక్కుతుంటే చూశావు గదూ!"

"చూల్లేదండి."

"మరి ఒంటరిగా వెళ్ళిందనీ, ఎవరూ తోడు లేరనీ యెలా చెప్పావు?"

సోని ముఖం భయంతో తెల్లగా పాలిపోయింది. నోట మాట రావడంలేదు.

"అసలు మీ అమ్మగారు అప్పుడప్పుడూ కొండమీదకి షికారు ఎందుకెళ్తోందో నీకు తెల్సా!"

"కొండ ఎక్కి దిగితే ఆరోగ్యం, జబ్బులు రావని చెప్పేవారండి," అంది సోని గొంతు పెగల్చుకుని.

"నిజం చెప్పు మీ అమ్మగార్ని కొండమీద నుంచి ఎవరు నెట్టేశారు?" గర్జించాడు ఇన్‌స్పెక్టర్.

సోనీకి ఏడుపు ముంచుకొచ్చి పెద్దగా యేడవసాగింది.

ఇంతలో స్టేషన్ బయట జీప్ ఆగింది.

రాముల్ని బేడీలు వేసుకుని తీసుకొచ్చారు. వాడు వచ్చీ రాగానే చెల్లెల్ని చూసి నిర్ఘాంతపోయాడు. అన్నని చూసి సోనీ బావురుమంది. చెల్లెలి దుఃఖం చూసి వాడు తుఫాన్‌లో చెట్టులా వణికిపోయాడు.

"అది చెప్పిందంతా అబద్ధం సార్! అమ్మగార్ని చంపింది నేను," అన్నాడు రాములు.

సోని పిచ్చిదానిలా అరిచింది. "లేదయ్యా! మా అన్నకేం తెలియదు. వేణుగోపాల్ బాబు మాటలు విని నేనే అమ్మగార్ని కొండమీద నుంచి నెట్టేశాను. నేనే. మా అన్న కాదు."

తర్వాత ముఖంమీద చేతులు పెట్టుకుని బిగ్గరగా యేడవసాగింది. రాములు కూడా యేమీ మాట్లాడలేక పోయాడు.

ఇన్‌స్పెక్టర్ నందనకుమార్ ఆశ్చర్యంగా చూశాడు రాయప్ప వంక.

"యస్ ఇన్‌స్పెక్టర్. సోనీ చెప్పింది నిజమే," అన్నాడు.

"వీళ్ళిద్దర్నీ లాకప్‌లో పడెయ్యండి," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

పోలీస్ కానిస్టేబుల్సు ఇద్దర్నీ లాకప్‌లోకి తీసుకెళ్లారు.

వేణుగోపాల్‌ను అరెస్టు చెయ్యడానికి సార్జెంట్‌ను మరి కొందరి పోలీసులను పంపాడు.

"అసలు వేణుగోపాల్ రాజామణిని హత్య చేయించి వుంటాడని యెలా అనుమానించారు?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"వేణుగోపాల్ గిల్టీ కాంప్లెక్స్‌తో బైట పెట్టు కున్నాడు తన రహస్యాన్ని. అసలు ఈ కేసులో వున్న భయంకరమైన రహస్యం ఒకటుంది. ఆ నిజం చాలా చేదుగా వుంటుంది గూడా వినేవాళ్ళకి."

"ఏమిటది?" కుతూహలంతో ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ నందకుమార్.

"రాజామణిని మీరెప్పుడైనా చూశారా?"

చూశానన్నట్లు తలూపాడు ఇన్‌స్పెక్టర్.

"ఎలా వుంటుంది?"

"చాలా అందంగా వుంటుంది!"

"అదికాదు. ఆమె ప్రవర్తన."

"నేనేమీ వినలేదు. కాని చూడటానికి మంచిదాని లాగే వుంటుంది."

"ఆమె వయసు మీరు గమనించారా? నలభై దాటి వుంటాయి కాని పదేళ్ళు తక్కువ వున్నట్లు కనిపిస్తుంది. అఫ్‌కోర్స్ నేనామెను చూశ్ళేదనుకోండి. రీసెంట్ ఫోటోగ్రాఫ్ చూశాను."

అవునన్నట్లు తల వూపాడు ఇన్‌స్పెక్టర్.

"ఆమె విడో. లత తండ్రి చనిపోయి రెండు మూడేళ్ళు అయిపోయిందేమో! తర్వాత ఆమె వేణు గోపాల్‌తో శారీక సంబంధం పెట్టుకుంది."

"ఈజిట్!" ఆశ్చర్యంగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"యస్ ఇన్‌స్పెక్టర్. ఆ వూళ్ళో చాలామందికి ఆ రహస్యం తెలుసు గూడా. ఏ గోడవైనా దాగుతుంది. ఇటువంటివి దాగవు. నేను గూడా అది వట్టి పుకారేమో అనుకున్నాను. కాని ఆమె అనుచరురాలు సోనీని సినీస్టార్ చేస్తానని ఆశ పెట్టి రహస్యం బైటకి లాగాను.

రాజామణి వేణుగోపాల్ సంబంధం ఆ ఇంట్లో అందరికీ తెలుసు ఆమె కూతురికి తప్ప. హేమలత అమాయకంగా వేణుగోపాల్‌ని ప్రేమించింది. వేణుగోపాల్ అల్లుడైతే తనకు గూడా బాగానే వుంటుందని రాజామణి అభ్యంతరం పెట్టలేదు. కాని అతనే భయపడ్డాడు. తల్లితో సంబంధం వుందనే సంగతి లతకి ఏ మాత్రం తెలిసినా తనని తిరస్కరిస్తుందని అనుమానపడ్డాడు.

ఎటువంటి పరిస్థితులలోనైనా హేమలతని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఆమె కోటి రూపాయల ఆస్తికి ఏకైక వారసురాలు. తల్లి శాశ్వతంగా వుండదు. కూతురితోనే తనకు జీవిత సంబంధం. అందుకని రాజామణిని సోనీ, రాముల సహాయంతో గుట్టు చప్పుడు కాకుండా చంపించాడు."

"ఓరి వీడి ఆశ పాడుగానూ!"

"వేణుగోపాల్ పదే పదే అనేవాడు తనకి బిజినెస్ వ్యవహారాలు తప్ప రాజామణి పర్సనల్ వ్యవహారాలు తెలియవని. లతతో గూడా పెద్ద పరిచయం వున్నట్లు చెప్పలేదు. కాని లత అతన్ని తను ప్రేమిస్తున్నట్లు చెప్పగానే నా అనుమానం అతని మీదకే పోయింది" అన్నాడు రాయప్ప.

"మొత్తానికి మీరు తీగంతా లాగి డొంకను బైటికి తీశారు?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ మెచ్చుకోలుగా చూసి.

"నేను కాకపోతే మీరైనా లాగివుండేవాళ్ళు."

"ఆc. మాకంత తీరిక యెక్కడుంది. అయినా ఆమె ప్రమాదవశాత్తు మరణించిందనే ధ్యాసలోనే వున్నాం."

రాయప్ప ఫోన్ యెత్తి, "కొంచెం లతతో మాట్లాడతాను. విత్ యువర్ పర్మిషన్" అన్నాడు.

"ఓ.. కే."

రాయప్ప నెంబర్ డైల్ చేశాడు.

అవతల లత ఫోను ఎత్తింది.

"హలో లతా! మీ అమ్మని చంపిన హంతకుడిని కని పెట్టాం." అన్నాడు.

"నిజమా?"

"ఆఁ...."

"ఎవరు?"

"నీ కొక చేదు నిజం వినిపించబోతున్నా! అందుకే ముందుగా సారీ చెప్తున్నా!"

"ఫరవాలేదు చెప్పు."

"అతను నీ ప్రియుడు వేణుగోపాల్." అన్నాడు రాయప్ప.

—ఐపోయింది—